# లోన్ స్క్వేర్

కె. రమలక్ష్మి

నేనూ, శాంతా చాలా జోరుగా కబుర్లు చెప్పేసుకుంటున్నాం కార్లో కూర్చుని. కారు బ్రాడ్‌వేలోంచి పోతూంది. బ్రాడ్‌వే అన్న పేరేగాని అంతకుమించిన ఇరుకురోడ్డు యింకోటి వుండదు అనిపిస్తుంది. లారీలు, రిక్షాలు సైకిలురిక్షాలు - వచ్చేపోయే సైకిళ్లు బస్సులు-వీటినన్నిటినీ త్రోసిరాజంటూ రాజుల్లాగా లోడు లాక్కుంటూపోయే కైవండివాళ్ళు. బ్రాడ్‌వేలో కార్లు నత్తనడక సాగాలి. అందుకే నేనెప్పుడూ శాంతతో అంటూవుంటాను 'మీ ఇంటికి రావడం అంటేనే భయం అని. అంచేతనే ఏ సినిమాకో బీచికో, ఏ సభకో సమావేశానికో ఇద్దరం కలిపి వెళ్ళాలని అనుకుంటే ఒక పద్ధతి పెట్టుకున్నాం. వచ్చేటప్పుడు తను మా ఇంటికి రావాలి. వెళ్ళేటప్పుడు నేను తనని దింపాలి.

ఆ రోజు బాగా ఆలస్యం అయింది. ఏదో పంధొమ్మిది రీళ్ళ సినిమా (ఇరవై రెండు రీళ్ళకు పైగా వుందనిపించేటంత బోరు) చూసి లోకాభిరామాయణం మాట్లాడుతూ— శాంత ఇంటికేసి పోతున్నాం.

కారు రెండు లారీల మధ్య విలన్ల మధ్య హీరోయిన్‌లా చిక్కుకుని ముందుకి సాగనా వెనక్కి సాగనా అంటూ వూగిసలాడుతోంది. ముందూ వెనుకా, ఇటూ అటూ—అంతటా హారన్ల మోతలు, లారీ డ్రైవర్లని కారు డ్రైవర్లు, కారువాళ్ళని సైకిలురిక్షావాళ్ళు, రిక్షావాళ్ళని సైకిలువాళ్ళు—అందరూ కలిపి లాగే బండివాడి మొండితనాన్ని తిట్టుకుంటున్నారు. చుట్టూ భూకంపం వచ్చినంత గోలగా వుంది. ఆ గోలలో సడెన్‌గా శాంతి అంది: "నీకు తెలుసా లక్ష్మీ! ఈ లోన్‌స్క్వేర్‌లో రిక్షా ఎక్కకూడదంటారు."

"అదేమిటీ? జార్జిటౌన్‌లో రాజ్యమేలేవి రిక్షాలే కదా!" అన్నాను.

"నిజంగానే యిక్కడ రిక్షాలెక్కడం ప్రమాదం. నా తోటి లాయర్లు చాలాసార్లు హెచ్చరించారు. నేనెప్పుడూ నవ్వేసి వూరుకునేదాన్ని....కాని' అంటూ ఆగింది శాంత.

ముందు లారీ రెండడుగులు కదలడంతో ట్రాఫిక్ ప్రవాహం కాస్త కదలడం ప్రారంభించింది.

"కాని...." అంటూ అందించాను.

"కాని ఎక్కడం నిజంగానే డేంజరు అని అనుభవంమీద గ్రహించాను." అంది శాంత చాలా మామూలుగా.

'వాట్?' అన్న ప్రశ్న అనుకోకుండానే గట్టిగా నమ్మలేనట్టుగా నా నోట్లోంచి వచ్చేసింది.

"అవును లక్ష్మీ! నిజంగానే చెప్తున్నా" నంది చాలా సీరియస్‌గా శాంత.

శాంతతో వచ్చిన చిక్కే అది. ఏటం బాంబులాంటి విషయాన్ని చాలా మామూలు విషయంగా చెప్పి వూరుకుంటుంది. ఇంక అసలు సంగతి తెలుసుకునేదాకా నాకే పనీ తోచి చావదని శాంతకీ తెలుసు!

"నువ్వేం చిన్నపిల్లవా? హైస్కూలు స్టూడెంటువా? ప్రాక్టీసుచేస్తున్న లాయరువి. పైగా క్రిమినల్ సైడుకూడా! నువ్విలా అనేస్తే- ఇంకెలా?" అడిగాను.

"అందుకే కాబోలు మీలాటి రచయిత్రిలు నిజాన్ని జాగ్రత్తగా రోట్టులో చుట్టేస్తారు." నవ్వుతూనే చురకవేసింది.

'ఇంక ఈ పూటకింతే. నేనూ నీతోపాటే ఇంటిదగ్గిర దిగి ఫోనుచేస్తాను' అంటూండగానే కారు సడన్‌బ్రేక్‌వేసి ఆగింది. 'బాబోయ్ మేం ఇటు మళ్ళుతాం' అని కారు సిగ్నలు పాటి కారు సిగ్నలు వెల్గి అరుతోంది కాని అక్కడ నిలబడి గట్టిగా అరిస్తే శాంత ఇంట్లో వినబడుతుంది. ఇంటికంత దగ్గిరగా వచ్చాక ఈ ట్రాఫిక్ మూలంగా ఎంతలేదన్నా ఒకొక్కప్పుడు మలుపు తిరగడానికే ముప్పై నిముషాలు- పట్టే ప్రమాదం వుంటూంటుంది.

ఏ కనుపించని దేవతలో కరుణించి రాక్షసంత లారీ ఎదురుగా నిలబడింది. మా కారు కదిలాకగాని అది ముందుకి రాడానికిలేదు. పోయేవాడి ప్రాణాన్నయినా ఆపగలమేమో గాని లారీని ఆపలేం. అందుకే ట్రాఫిక్ కాస్త ఆగింది. బ్రతుకుజీవుడా అని డ్రైవరు కారు సందు మళ్ళించాడు....

శాంత ఇంట్లో చాలా చల్లగా హాయిగా వుంటుంది. పాత కాలపు ఇల్లేమో, ఎత్తుగా కప్పు. నేలమీద నున్నని సిమ్మెంటూ ఏదో విశాలంగా ఫీలవుతాం. శాంతా ఈ ఇంట్లో ఇంత హాయిగా వుంటుందా. ఇక్కడికి రాడానికెంత గోలో చూడు అని నవ్వుతూ ఫోను దగ్గిరకి నడిచాను.

ఇంటికి ఫోనుచేసి 'నేను సాయంత్రంగాని రాను' అని చెప్తూంటే ఓ పట్టాన ఫోను కింద పెట్టదు మా చిన్నది. 'సినిమా ఎలావుంది? ఆంటీ నువ్వూ ఇంకో సినిమాకి వెడుతున్నారా! ఏదో ఒకటి దాన్ని వదుల్చుకుని శాంత గదిలో వచ్చి పడ్డాను.

శాంత హాయిగా మంచానికి అడ్డంపడింది. నేను కుర్చీలో కూర్చుని కాళ్ళు మంచం పట్టె మీద ఆన్చుకుని 'చెప్పు' అన్నాను.

'ఎందుకు తీస్తారయ్యా ఇలాంటి సినిమాలు డబ్బుతో ఏ వ్యాపారమో చేసుకోక' అంది. మేం చూసి వచ్చిన సినిమాను తల్చుకుంటూ.

ఫ్రీ టిక్కెట్టుతో వెళ్ళాం కనక సరిపోయింది. లేకపోతే ప్రాణం ఇంకా ఎంత హూసూరు మనునో అన్నాను. ఈ బాధకి తోడు డబ్బుకూడా కర్చయిందంటే హూసూరు మనదా!

పనిపిల్ల లెమనేడ్ తెచ్చిచ్చింది. ప్రాణం లేచివచ్చింది.

"ఇంకిప్పుడు చెప్పు. లోన్‌స్క్వేర్‌లో ఎందుకు రిక్షా ఎక్కకూడదట." అడిగాను సస్పెన్సు భరించలేక.


"రిక్షావాడు మనం చెప్పకుండానే వాడెక్కడికి తీసుకెళ్ళాలో అక్కడికే తీసుకెడతాడు కనుక!" అంది నవ్వుతూ.

'అదేమిటి? ఈ మాట కెక్కడేనా అర్థం వుందా? మనం చెప్పకుండా వాడెక్కడికి తీసుకువెడతాడు? ఎందుకు తీసుకెడతాడు?' వింతగా తోచి అడిగాను.

అదే వాళ్ళ స్పెషాలిటీ....అసలు విని అంటూ చెప్పడం ప్రారంభించింది.

మధ్యలో ఏమిటీ? ఎందుకూ? అంటే శాంతకి కోపం వస్తుంది. అందుకే కథ వినడానికన్నట్టు హాయిగా జేరబడి కూర్చున్నాను.

ఆ రోజు హైకోర్టులో లాయర్ల మీటింగు జరిగింది. నేను కోర్టు దాటి బ్రాడ్‌వేకేసి నడవడం ప్రారంభించాను. ముందు నల్గురైదుగురు




వదుస్తున్నారు. మరీ అంత లేటూ కాలేదు ఎనిమిదిన్నర అయివుంటుందేమో. ఇరవై ఏళ్ళనుంచి వున్న చోటు — నాకు కనీసం భయం కూడా తోచదక్కడ. చెకచెక నడుస్తున్నాను. ముందున్నవాళ్ళల్లో కొందరు పక్కరోడ్లలోకి మళ్ళిపోయారు. ఇంకా కొట్లు అన్నీ మూసేయ లేదు కూడా. కాని నా వెనక ఎవరో వదుస్తూ వస్తున్నట్టు గమనించాను.

"ఛ. ఆలా ఎవరొస్తారు?" అన్నా.

"అదే కద. మనం పాష్ [illegible]బుల్ కాలేజీ పిల్లలమా! సొసైటీ లేడీస్‌మా కాని నిజంగానే ఓ పెద్దమనిషి కాస్త దూరంలో నడిచి వస్తున్నాడు. వేమ కాస్త గబగబ నడిచాను. పది అడుగులు వేస్తే లోన్‌స్క్వేర్. లారీలు, బస్సు, రిక్షాలు చాలా రద్దీగా వుంటుంది. ఏం భయంలేదు అని అనుకుంటూ చెకచెక నడుస్తున్నాను. ఆ మనిషి నడక వేగం హెచ్చించాడు. ఎన్నడూ లేనిది నాకు కాస్త బెరుకుగా తోచింది. తక్షణం 'రిక్షా' అని పిలచి వచ్చిన రిక్షాలో ఎక్కి కూర్చుని 'పద' అన్నా చేత్తో ముందుకి చూపిస్తూ.

రిక్షావాడు సైకిలెక్కి కూర్చున్నాడుగాని తొక్కలేదు. వెనక్కి తిరిగి చూస్తున్నాడు.

"ఏయ్! తిన్నగా పదమంటూంటే ఏమిటి! ముందువెనుకలు చూస్తూ" కసిరాను.

కసిరినా వాడిలో చలనంలేదు. 'వారూ వస్తున్నారు కద' అన్నాడు.

నా గుండె ఝల్లుమంది. ఒళ్ళు మండిపోయింది. ఇంతలోనే పెద్దమనిషి వచ్చి రిక్షా హాండిల్‌మీద చేయివేసి నిలబడ్డాడు.

లోన్‌స్క్వేర్ లైట్ల వెల్గులో అతని ముఖం స్పష్టంగా కనిపించింది, బాగా నూనె రాసిన క్రాపు లైటు కాంతికి మెరుస్తూంది. తెల్లని షర్టు. సగం చేతులది. చేతికి రవ్వల ఉంగరం మెర్క్యూరీ లైటులో నిప్పురవ్వల్లాగా మెరుస్తోంది. తెల్లని పంచ, లుంగీ కట్టాడు. కాళ్ళకి ఖరీదైన బూట్లలాంటి జోళ్లు. ముఖంమీద ఓ వెకిలి నవ్వు.

"ఏం? పదమంటే వినబడ్డంలేదా? ఈయనెవరు?" ఓ పక్క లోపల ఒణుకుపుట్టుకొస్తూన్నా పైకి ధైర్యంగా [illegible] కేకవేశాను.

"ఏందమ్మా! ఆరెక్కించమన్న సవారి కద - ఆగానందుకే" అన్నాడు నాకంటే గట్టిగా రిక్షావాడు.

ఆ క్షణంలో ఎక్కడో నా స్నేహితురాలు చంద్ర యింకా అంతా అన్నమాట మెరుపులా మెరిపింది—ఇది లోన్‌స్క్వేర్. ఇక్కడే రిక్షా ఎక్కకూడదన్నారు వాళ్ళు. ఎవరో చెప్తున్నట్టు విన్పిస్తున్నాయి నా చెవుల్లో వాళ్ళ మాటలు. ఒక్క ఉదుటున రిక్షాలోంచి దిగాను.

"ఉండమ్మా!" అంటున్నాడు రిక్షావాడు.

"నోర్మూయ్! ఎవరనుకుంటున్నావు? నేను లాయర్ని. రేపీపాటికీ వ్యవహారం ఏమిటో తేల్చేస్తాను! జాగ్రత్త!" అన్నాను.

నేనిలా విరుచుకుపడ్డం తరవాయి రిక్షామీదనుంచి చెయ్యి తీసేసి ఆ పెద్దమనిషి చెకచెక నడుచుకుంటూ వెనక్కి వెళ్ళిపోయాడు. రిక్షావాడు లోన్‌స్క్వేర్ మలుపు మళ్ళేసి ఏరోప్లేనులాగా తొక్కుకుపోయాడు రిక్షా. ఇంకా వాడి రిక్షా గంట చప్పుడు విన్పి




స్తూనేవుంది. నేను ఇంటివేపు నడక సాగించాను. మన మెట్లెక్కేదాకా నా వెనక ఎవరో నడుస్తున్నంతక్షేభయంగానే అనిపించింది నాకు. అదే ఆఖరుసారి- 'నేనక్కడ రిక్షా ఎక్కడం' ఆపింది శాంత.

"మై గాడ్! ఏమిటి వాడి ఉద్దేశ్యం?" నమ్మలేనట్టు అడిగాను.

శాంత తేలికగా నవ్వేసింది. క్రిమినల్ కేసులు చేసి మేజిస్ట్రేటు కోర్టుల్లో వాదించి వాదించి శాంతకి ఎంత విపరీతమైనా వింతగా తోచదు.

"ఏముందీ, వాళ్ళంతా పింప్స్ అన్నమాట. వ్యాపారంకోసం లారీలమీద వస్తారు కదా— కొత్వాల్ చావడిలో సరుకులు దించేసి ఆ పూట సిటీలో హాయిగా గడిపేస్తారు. మళ్ళీ ఉదయం లారీలో తిరుగుప్రయాణమైపోతూంటారు.... నాకీ అనుభవం అయ్యేక అందరూ చెప్పడమే తమ తమ అనుభవాలు. చూశావా!' అంది శాంత.

"అది సరే, ఇదంతా పోలీసులకి తెలియదా? ఎందుకోసారి రౌండప్ చేయరు?" అడిగాను.

"ఏం? వ్యభిచార గృహాలమీద ఎన్నిసార్లు దాడులు చేశారే అవి రూపుమాసిపోయాయా? అది సరే, ఈ కథ యింతటితో ముగిస్తే, నాకు జ్ఞాపకమే వుండకపోను." అంది చాలా మామూలుగా.

"అంటే? దీనికి తరవాయి వుందా? చెప్పు చెప్పు." అంటూ కుతూహలంగ ముందుకి వంగాను.

"ఆహా! చక్కగా నే కథలు చెప్పడం, నువ్వు రాసి పేరుతెచ్చుకోడం...." అంది.

"చెప్తా! చూడప్పుడే సాయంత్రం అయిపోయింది" అన్నా కిటికీకేసి చూస్తూ. పాత కాలపు ఇల్లేమో రంగురంగుల అద్దాల మొజైక్‌లోంచి సాయంత్రపు ఎండ వింత రంగులు విరజిమ్ముతోంది.

"ఇది జరిగి దరిదాపు ఆర్నెల్లయిపోయింది. నేనీ సంగతే పూర్తిగా మరచిపోయాను. కాని ఆ రోజు నన్నెవరో వెన్నుమీద కొట్టి జ్ఞాపకం చేసినట్టయింది." ఆగింది శాంత.

"ఏ రోజు? ఎప్పుడు? అతనే తిరిగి కనిపించాడా?"

'పోలీసుకి రిపోర్టు ఇవ్వవలసింది' అన్నా.

శాంత చాలా తేలికగా నవ్వింది. 'కనిపించిన మాట నిజమేగాని, పోలీసుకి రిపోర్టిచ్చే చోట కాదు. ప్రెస్ రిపోర్టర్లు చుట్టుముట్టే చోట!' అంది.

'అంటే? మైగాడ్ శాంతా- అంతా తికమకగా మాట్లాడుతావు నువ్వు. చెప్పు చెప్పు' అని వాళ్ళ గౌరిని కేకేశాను- మళ్ళీ కాస్త కాఫీనీళ్ళు పొయ్యితల్లీ అని.

'మీరంతా ఇలాగే కాఫీలు తాగి ఆరోగ్యం పాడుచేసుకుంటారు' అంటూ ఓ రెండు నిమిషాలు లెక్చరిచ్చింది. నేనా ధాటికి బ్రేక్ వేయకపోతే ఇంకా సాగించేదే.

'సరేగాని, అసలు సంగతి చెప్పు ...'

'ఆరోజు మైలాపూరులో సేవాసమాజం మీటింగు. కొత్తగా హాలు కట్టారు. దానికవి గాంధీజీ బొమ్మ ఒక దాత బహూకరించారు. దాని ఆవిష్కరణ ఉత్సవం. అప్పటి మన ప్రెసిడెంటుగారు సిటీలో వుండి యీ పని చేయడానికి అంగీకరించారు. ఇంట్లో అంతా బయలుదేరాం. దాంతో మైలాపూరు వెళ్ళే సరికే ఆలస్యం అయింది. సభ ప్రారంభించేశారు. నేనూ వసంతా అంతా వెనక కూర్చున్నాం. ప్రెసిడెంటుగారు కరతాళ ధ్వనుల మధ్య లేచి నిలబడ్డారు.'

'అబ్బ! ఇవన్నీ మామూలే కద. అసలు సంగతి చెప్పు బాబూ' అన్నాను- డిటైల్స్ వద్దని నాకు చాలా ఆత్రంగా వుంది. ఈ నూనెక్రాపు పెద్దమనిషి ఏ రూపంలో వచ్చాడా మళ్ళీ అని.

"ఎందుకంత తొందర? అలా కట్టె కొట్టె తెచ్చె అని చెప్పేస్తే గొప్పేయింది! ప్రెసిడెంటుగారు గాంధీగారిని గురించీ, యీ చిత్రపటం ఇంత గొప్ప మనసుతో సేవాసమాజం హాలుకి బహూకరించిన దాత గురించీ- ఉపన్యసించి ఫ్లాష్‌లైట్ల మధ్య హడావిడి మధ్య సుతారంగా పటానికి కట్టిన తెర తెరిచే పట్టు తాడు పట్టి లాగాడు. బోసి నవ్వులు ఒలకపోస్తూ అక్కడి జనానికి సాక్షాత్కరించారు గాంధీ.

ఇంతట్లో ఆనాటి సభాధ్యక్షులు, ప్రముఖ సంఘసేవిక- లేచి, 'ఇప్పుడు దాతగారితో నిలబడవలసినదిగా ప్రెసిడెంట్‌ని కోరారు. ఆయన నల్లకళ్ళద్దాల వెనుక నవ్వుతుంటూ గాంధీ బొమ్మకి ఓ పక్కగా నిలబడ్డారు. అదే క్షణంలో ముందువరసలోంచి లేచి వేదికనెక్కి, గాంధీ బొమ్మకి రెండో పక్క నిలబడ్డాడు దాతగారు.

నా గుండె ఒక్కక్షణం ఆగినట్టయింది.

నా కళ్ళ ఎదుట కనబడుతున్న వ్యక్తి- నిజంగా నిలబడి వున్నాడా? లేక నా భ్రమా? వింతగా, చూస్తూ వుండిపోయాను.

'ఏమే, ఏమిటది? ఆయనగారే ఐదువేలు డొనేషన్ ఇస్తున్నట్టు ప్రకటిస్తూంటే, కనీసం చప్పట్లు కొట్టు' అంటూ నా పక్కనున్న వసంతి మోచేత్తో పొడిచింది.

ఉలిక్కిపడి వాస్తవ ప్రపంచంలో వచ్చిపడ్డాను.

'నిజంగా యీయనేనా గాంధీ బొమ్మ బహూకరిస్త' నమ్మలేనట్టు అడిగాను.

'అందులో, మళ్ళీ ఐదు ేలు ఇస్తున్నందుకే కథ ఆ ఫోటోలూ, [ ]సిడెంట్ ఆ దండవేయడమూ' అంది వసం[ ]

'మైగాడ్. నా కళ్ళని నే నమ్మలేక పోయామ లక్ష్మి. సరిగ్గా నేనెక్కి[ ] సైకిలు రిక్షా హాండిల్ మీద చేయివేసి పిలచి - వ్యక్తి ఆ దాత. ఆతని ముఖంమీద చిరునవ్వులో కూడా మార్పులేదు....' ఆగింది శాంత

నా నుదుటిమీద చెమటలు పట్టేశాయి. నాకు తెలియకుండానే నేను నమ్మలేనట్టు శాంతకేసే చూస్తూ చూస్తూ వు[ ]డిపోయాను.

'ఏం ఏమైంది అలా చూస్తు[ ]న్నవు?' అడిగింది శాంత.

'నిజంగా అంత పెద్దమని[ ]నా వాడు! ఇదెలా సాధ్యం' అడిగా.

'కింట్లో అసాధ్యం ఏము[ ]ది? ఏ ఫీల్డు రానీ:' నవ్వింది శాంత.

'శాంతా, నిజంగా దేంజరే. అక్కడ రిక్షా ఎక్కడం. కాని ఇలా పూసరవెల్లిలా రంగు మార్చినవ్వాడు పంఘంలో ఇంత పెద్దమనిషిగా చెలామణీ అవుతున్నప్పుడెలా- [ ]నని మనం రక్షించుకోడం' అడిగాను.

'అ[ ] పాయింటే!' అంది శాంత.

'పా[ ]యింటు కాదోయ్. ప్రోబ్లెమ్. రేపీ పెద్దమనిషి ఏ సెమినార్‌లోనో, ఏ సభలోనో తగులుతాడు. అప్పుడెలా?'

'నా ముఖంలా వుంది - నీ అనుమానం- ఇంగ్లీషులో ఓ సామెత వుంది- వంతెనలు వచ్చినప్పుడు దాటాలని! వినలేదా?' నవ్వుతూనే అంది.

'అం[ ]టే?'

'అం[ ]టే అదే. ఎదురైనప్పుడు చూసుకోవాలి[ ]గాని ఇప్పుడు కాదని! సరి, ఇంటికి బయలు[ ]దేరు' అంటూ లేచింది.

'అ[ ]ును. ఉదయం ఆట సినిమా రాత్రి దాకా [ ]ీకోసం వేశారా అంటుంది అక్క' అంటూ లేచానేగాని- నా మనస్సు ఎక్కడో వుంది.

'ఇ[ ]లా చవకబారుగా బజారుకాసి ఆడవారిని [ ]ీసుకువెళ్ళే మనిషి, అలాంటి గొప్ప వ్యక్తి ఒకడేగా ఎలా వుండగలడబ్బా!' అంటూ మెట్లు దిగుతున్నాను.

"అ[ ]సలు ముఖానికీ, పబ్లిక్ ముఖానికీ- కొందరి[ ]లో అంత తేడా వుంటుంది!' చాలా కామ్‌గా అంటూ కారుదాకా వచ్చింది శాంత

కారు తలుపు తెరిచి నే కూర్చున్నా[ ] వేస్తూ 'నా బాధ అదికాదు. చచ్చు పీనుగ- గాంధీ పేరుని మైలపరచాడని!' నవ్వుతూ చేయి వూపింది.

ఇది జరిగి చాలా రోజులై పోయింది. కా[ ] ఎప్పుడు శాంత ఇంటికి వెడుతున్నా ఓసా[ ] కిటికీలోంచి వంగి లోన్‌స్క్వేర్ అనే బోర్డు ఓసారి చూసి నవ్వుకుంటూ వుంటాను. సిమెంటు పలకలో నల్లని అక్షరాలు.

'ఇక్కడ రిక్షాలెక్కడం దేంజరుట డ్రయివర్!' అన్నా యధాలాపంగా ఓసారి.

'ఆమా అమ్మా, తెలియాదా?' మామూలుగా అడిగాడు డ్రయివరు.

నా కంత ఆశ్చర్యం కల్గించిన విషయం- అంత మామూలుగా అందరికీ- తెలిసినదా అనిపించింది.

అదే నాగరికత ప్రబలితే వచ్చిన తంటా! ప్రిమిటివ్‌గా తెలిసే ఎన్నో విషయాలు. స్వాభావికంగా తెలియవలసిన సత్యాలు—కళ్ళకి కనబడినా- ఓ పట్టాన నమ్మకుండా చేస్తుంది. ***


## నూతన ప్రచురణలు

**నవలలు**

తూర్పున వాలిన సూర్యుడు .. శ్రీకాంత శర్మ 12.50

వీళ్ళూ మనుషులే! .. కె. విజయలక్ష్మి 5.50

కరుణించని గతం .. రంగనాథ్ 7.00

అంతర్వాహిని .. హితశ్రీ 6.00

మల్లెల మనసులో మమతల ఊయల .. డా॥ కృష్ణకుమారి 8.00

**బాలసాహిత్యం**

హరివిల్లు .. నం. వారి రామమోహనరావు 5.00

పసిడి మనసుల పాలపాటలు .. వింజమూరి లక్ష్మి 3.50

**(సంపాదకీయాలు)**

మూడు దశాబ్దాలు .. నార్ల వెంకటేశ్వరరావు 35.00

**నాటిక**

కథ చెప్పిన నిజం .. ఇందిరా పార్థసారథి 2.50

**కథలు**

వీరు ప్రేమించలేరు .. ఎ. విజయలక్ష్మి 7.00

**విమర్శ**

సారమతి నన్నయ .. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 10.00

**వ్యాసాలు**

కదంబం .. నార్ల వెంకటేశ్వరరావు 8.00

కొత్తా-పాత .. నార్ల వెంకటేశ్వరరావు 10.00

**గేయాలు**

కూనలమ్మ పదాలు .. ఆరుద్ర 4.00

అనుభూతి గీతాలు .. శ్రీకాంత శర్మ 4.00

నవోదయ పబ్లిషర్స్
విజయవాడ 2, గుంటూరు 2